సిరాజుద్దీన్‌కు అభినందనలు

భట్టిప్రోలు: వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా భట్టిప్రోలుకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్ నియమితులు కావడంతో సోమవారం ఆయన స్వగృహంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కలసి అభినందనలు తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి ఫలితం దక్కుతుందని అన్నారు. అందరూ కలసికట్టుగా పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరారు. ఆమె వెంట ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, నాగకుమారి, ప్రకాష్, పంచాయతీ వార్డు సభ్యులు కుక్కల వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పూరి నాగేశ్వరరావు, సయ్యద్ నబీ, దావూరి నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

వేమూరు: నియోజకవర్గ ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి వి.జ్యోతి బసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో 1,97,449 మంది ఓటర్లు ఉన్నారు. చుండూరు మండలంలో 38,130 ఓట్లు, అమర్తలూరులో 37,349, వేమూరులో 34,752, కొల్లూరులో 45,126, భట్టిప్రోలులో 42,092 ఓట్లు ఉన్నాయన్నారు.

రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు

డీసీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు

వెల్లటూరు(భట్టిప్రోలు): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి వెల్లటూరు చానల్ పరిధిలోని ఆయకట్టు ప్రాంతాలకు పుష్కలంగా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు (కర్ణ) తెలిపారు. సోమవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని నీటి పారుదల శాఖ సెక్షన్ కార్యాలయంలో భట్టిప్రోలు, సూరేపల్లి సాగునీటి వినియోగదారుల సంఘాల సర్వసభ్య సమావేశం డీసీ చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగునీటి కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులకు సంబంధించి అంచనాలు రూపొందించి పూర్తిస్థాయిలో పనులు నిర్వహించనున్నట్లు చెప్పారు. డీసీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వెలగపూడి రవిప్రసాద్‌లను ఇరిగేషన్ డీఈ జి.దీన్ దయాళ్, జేఈఈ సువర్చల, డ్రైనేజ్ ఏఈ పూరిమలు సన్మానించారు. కార్యక్రమంలో సూరేపల్లి సంఘ అధ్యక్షుడు వాకా పాపారావు, ఉపాధ్యక్షుడు షేక్ ఇబ్రహీమ్ ఖలీల్, డొక్కు శ్రీనివాసరావు, ఆయా సంఘాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

రేపల్లె రూరల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లా(ఐఏఎల్) ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర డైరీని సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ నాయకులు పి.నాగాంజనేయులు మాట్లాడుతూ డైరీ న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విలువైన సమాచారాన్ని డైరీలో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దారం సాంబశివరావు, ఒడుగు రాంబాబు, న్యాయవాదులు రబ్బానీ, పి.భూషణం, మోర్ల కృష్ణారావు, ఉప్పాల శ్రీనివాసరావు, కె.ప్రసాద్, సూరిబాబు, రామారావు, ఆర్.ప్రతాప్, రమేష్ రాంజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని పిట్టలవానిపాలెం ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు చెప్పారు. పిట్టలవానిపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో మంజూరైన గోకుల్ షెడ్ల నిర్మాణంపై ప్రజా ప్రతినిధులకు ప్రజలకు అవగాహన కల్పించకుండా లబ్ధిదారులను ఎలా ఎంపిక చేశారని ఏపీవో సుభాషిణిని నిలదీశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజా ప్రతినిధులకు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ మెహర్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులో తనిఖీలు

చందోలు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలం చందోలు శివారులోని నదిముల్లాయపాలెం రేషన్ షాపులో సోమవారం సివిల్ సప్‌లైస్ డీటీ ఫణికుమార్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించగా 114 క్వింటాళ్ల బియ్యం, 147 కందిపప్పు ప్యాకెట్లు, 198 పంచదార ప్యాకెట్లు లేకపోవటాన్ని గుర్తించామని తెలిపారు. ఈ మేరకు రేషన్ దుకాణంపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో వీఆర్వోలు నాగజ్యోతి, అరుణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ సర్వే

నగరం: భూ సమస్యలను పరిష్కరించేందుకే రీసర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ నాంచారయ్య చెప్పారు. మండలంలోని శిరిపూడి గ్రామంలో సోమవారం రీ సర్వేపై వీఆర్వో, సర్వేయర్‌ల శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. రీ సర్వేతో గ్రామాలలో నెలకొన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాలలో పర్యటించి భూములను సర్వే చేసి సమస్యలు లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేల్లో అలసత్వంగా ఉంటే చర్యలు తీసుకుంటాం

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: ఇంటింటికి జియో ట్యాగింగ్ సర్వేలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ రఘునాథ రెడ్డి మాట్లాడారు. ఇంటింటికి జియో టాకింగ్ సర్వేలో, ఎన్టీఆర్ భద్రతా భరోసా పింఛన్ల పంపిణీలో అలసత్వంగా ఉన్న వారిపై సీరియస్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌లో లబ్ధిదారులు సిబ్బందిపై ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. పింఛన్ల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా చెరుకుపల్లి



ఢిల్లీ పబ్లిక్ స్కూల్



చెరుకుపల్లిలోని నేషనల్ హైవే

చెరుకుపల్లి: అభివృద్ధి వైపుగా చెరుకుపల్లి పరుగులు తీస్తోంది. విద్య, వైద్యం, వ్యాపార రంగాలలో బలపడుతూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దిగమర్రు నుంచి ఒంగోలు వరకు ఉన్న జాతీయ రహదారి చెరుకుపల్లి గ్రామం మధ్య నుంచి వెళ్లటంతో వ్యాపారపరంగా ముఖ్య కేంద్రంగా మారింది. జాతీయ రహదారికి ఇరువైపుల పలు వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారి వినియోగంలోకి రావటంతో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరింది. గతంలో ఏ చిన్నపాటి వస్తువు కొనుగోలు చేయాలన్నా ఈ ప్రాంత వాసులు తెనాలి, గుంటూరు, రేపల్లె వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే నేడు పలు వ్యాపార సంస్థలు ఉండటంతో కేంద్రం అభివృద్ధి చెందటంతో పాటు సమీప ప్రాంతాల ప్రజలకు అన్ని రకాల వస్తువులు చెరుకుపల్లిలో లభిస్తున్నాయి. రోజురోజుకు అన్ని రంగాలలో చెరుకుపల్లి అభివృద్ధి చెందటంతో విశాల భవంతులు, అపార్ట్‌మెంట్‌లు ఏర్పడుతున్నాయి. టీవీ, సెల్‌ఫోన్, హోమ్‌నీడ్స్, టెక్స్‌టైల్స్, ఫరి్నచర్ వంటి కార్పొరేట్ షోరూమ్‌ల బ్రాంచ్‌లు చెరుకుపల్లిలో వెలిసాయి. చెరుకుపల్లితో పాటు చుట్టు పక్కల 40 గ్రామాలలోని ప్రజలు తరచూ ఇక్కడికి వస్తుండటంతో అన్ని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. విద్యా రంగంలో పలు కార్పొరేట్ స్కూల్స్‌తో పాటు జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఈ ప్రాంతంలో అందుబాటులోకి రావటంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా విధానాలు ఈ ప్రాంత విద్యార్థులకు అందుతున్నాయి. చెరుకుపల్లిలో స్థాపించబడిన అతి తక్కువ కాలంలోనే ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు కేంద్ర ప్రభుత్వంచే పలు అచీవ్‌మెంట్ అవార్డులు లభించాయి. నిబద్ధత నిష్ఠాతులైన వైద్యులు ఉండటంతో వైద్య సేవలకు చెరుకుపల్లి ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతవాసులతో పాటు సమీప జిల్లాల ప్రజలు వైద్య సేవలకై ప్రతి నిత్యం చెరుకుపల్లికి వస్తుంటారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పేరు గాంచిన పలు కోచింగ్ సెంటర్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతంలోని కోచింగ్ సెంటర్‌లలో డీఎస్సీ, ఆర్మీ, పోలీసు, గ్రూప్-1, గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ పొందిన వారు ప్రభుత్వ కొలువుల్లో అనేక మంది ఉన్నారు. వేడుకలు జరుపుకోవటానికి అధునాతన ఫంక్షన్ హాల్స్ అందుబాటులో ఉన్నాయి.



కలప వ్యాపారంలో చెరుకుపల్లి ఎంతో ప్రసిద్ధి చెందింది. చెరుకుపల్లి నుంచి కలప, పలు రకాల ఫర్నిచర్‌లు రాష్ట్రం నలుమూలలకు సరఫరా అవుతుంటాయి. పెంకుటిళ్లు, సావిళ్లకు అవసరమైన తాటి వాసాలు ఇక్కడ ప్రత్యేకంగా లభిస్తాయి. మండలంలో తయారవుతున్న చేనేత వస్త్రాలకు మంచి గుర్తింపు ఉంది. వ్యవసాయ రంగంలోనూ చెరుకుపల్లి మేటిగా ఉంది. ఈ ప్రాంతంలో వరి, మినుము, వేరుశనగ, జొన్న, మొక్కజొన్నలతో పాటు పలు రకాల పూల సాగులను రైతులు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.